క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని గ్రామాలు

కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికి వేత పనుల నిమిత్తం మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు కొన్ని గంటలు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖా ఏఈ ప్రదీప్ కుమార్ సోమవారం మండల విద్యుత్ కార్యాలయంలో ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నంగి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మున్నంగి, వల్లభాపురం, పిడపర్తిపాలెం, దంతలూరు, ఈమని టౌన్ ఆయా గ్రామాల్లో ఉదయం 9నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కావున ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలో ఆన్ కాల్ పద్ధతిలో పనిచేసేందుకు అవసరమైన డ్రైవర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చి ఆరు సంవత్సరాలు దాటిన వారందరూ అర్హులన్నారు. తెనాలి డిపోలోని డీఎం కార్యాలయంలో, ఆఫీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించి ఆప్లికేషన్లు పొందాలని సూచించారు. అర్హులైన వారందరూ దీనిని ఉపయోగించుకోవాలన్నారు.

హెపటైటిస్ నివారణపై సదస్సు




తెనాలి: స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో సోమవారం వరల్డ్ హెపటైటిస్ దినోత్సవం నిర్వహించారు. ఐపీఏ-ఎస్ఎఫ్ ఏఎస్ఎన్ చాప్టర్, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాల ఆధ్వర్యంలో సదస్సును ఏర్పాటు చేశారు. హెపటైటిస్ వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. బీఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యార్థిని షేక్ మొబినా హెపటైటిస్ వైరల్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన అంశాలను శాస్త్రీయంగా వివరించారు. ఐపీఏ-ఎస్ఎఫ్ ఏఎస్ఎన్ మెంటార్ పి.భార్గవి, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాల ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కల్యాణ్ చక్రవర్తి పర్యవేక్షించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



తెనాలిటౌన్: తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ నిర్వహించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో సోమవారం తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ నందివెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనందలి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తన్నీరు శివశంకర్ పాల్గొని వీటిని అందజేశారు. గ్రామానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, సుబ్బారావు, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, అనిల్, శేషు, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి జన్మదినోత్సవం



తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలస్వామీజీ ఆధ్వర్యంలో అర్ధ చాతుర్మాస వ్రతదీక్షా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 19వ రోజైన సోమవారం గోదాదేవి పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. తుళ్లూరు నుంచి శ్రీకృష్ణాశ్రమం శ్రీస్కంధ దేవానందగిరి స్వామివారు, గోదాదేవికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దా భక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు నేడు

తాడికొండ: తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత మెదడు, నరాలకు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుందరాచారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో తాడికొండలోని రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని మండలంలోని ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం ఉంటుందని.. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధికారులు తెలిపారు.

గంబూషియా చేపలతో దోమల నిర్మూలన

తెనాలి సబ్ యూనిట్ అధికారి పున్నారెడ్డి

మున్నంగి(కొల్లిపర): గుంతలు, చెరువుల్లో, మురుగు కాల్వలల్లో, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలల్లో ఎటువంటి రసాయనిక పదార్థాలు వినియోగించకుండా జైవిక విధానంలో గంబూసియా చేపలను విడుదల చేయడం వలన నీటిలోని దోమ లార్వాదశలోనే ఈ చేప తిని వేయడం వలన దోమల ఉత్పత్తి తగ్గిపోతుందని దీని ద్వారా రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో దోమలను నిర్మూలించవచ్చు అని మలేరియా తెనాలి సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి అన్నారు. జిల్లా మలేరియా శాఖాధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని మున్నంగి పీహెచ్‌సీ పరిధిలో మున్నంగి గ్రామంలో వివిధ ప్రాంతాల్లో నిల్వనీటిలో దోమల పెరుగుదల నిర్మూలించటానికి గంబూసియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ ఒక్క గంబూసియా చేప ఒక్క రోజుకి సుమారుగా 180 నుంచి 300 దోమల లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని, 42 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా తట్టుకోవటం, తక్కువ నీటి పరిమాణం ఉన్న నీటి గుంతలలోనూ ఆక్సిజన్ తక్కువ ఉన్న నీటిలోను ఇవి బాగా పెరుగుతూ దోమల నిర్మూలనకు దోహద పడతాయన్నారు.



మున్నంగి చెరువులో గంబూసియా చేపలను విడుదల చేస్తున్న పున్నారెడ్డి

ఇవి ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు జీవించి ఉంటాయని తెలిపారు. ప్రజలు ఇంటి లోపల ఇంటి బయట నీటి నిలువ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సైడు కాలవలో మురుగు నీటి ప్రవాహానికి చెత్తాచెదారం అడ్డు వేయకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య విస్తరణాధికారి తుమ్మ నాగరాజు, స్టాఫ్ నర్స్ కల్పన, ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

30న కొలకలూరులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ఎంపీడీవో దీప్తి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఈ నెల 30న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆహార పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గల శానిటేషన్ వర్కర్లు ఈ డ్రైవ్‌లో పాల్గొంటారని వెల్లడించారు. ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శానిటేషన్ వర్క్ జరుగుతుందని చెప్పారు. మండలంలో అత్యధిక జనాభా కలిగిన గ్రామం కొలకలూరుగా తెలిపారు. అదే విధంగా ఉదయం 9 గంటల నుంచి మంత్రి మనోహర్ గ్రామంలో స్పెషల్ గ్రీవెన్స్ రూపంలో అర్జీలు స్వీకరిస్తారని, మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. మండలస్థాయి అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొంటారని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 31న నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం. లక్ష్మీపతిరావు సోమవారం తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

హాస్టళ్లలో విద్యార్థి విభాగ నాయకుల తనిఖీ

తెనాలిరూరల్: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 'సంక్షేమ హాస్టళ్ల బాట' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు హాస్టళ్లను సోమవారం తనిఖీ చేశారు. పట్టణ నాజరుపేటలోని గిరిజన గురుకుల పాఠశాల, బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని వసతులు, పౌష్టికాహారం అందేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో బొద్దింకల భోజనం, కాళ్ల జెర్రి కూరలు, బల్లుల సాంబారుతో వసతి గృహాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు పల్లె రోహిత్ శామ్యూల్, మధిర రవితేజ, నిట్టా బాలు, పోకరి విజయ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సీసీ రోడ్డు నిర్మించాలంటూ స్థానికుల వినతి



తెనాలిఅర్బన్: 3వ వార్డులో సీసీ రోడ్డును నిర్మించాలని ఆ ప్రాంతవాసి మహాలక్ష్మి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావుకు వినతిపత్రం ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఏసీపీ శివన్నారాయణ, ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు, డీఈ లు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాము కాట్లతో పశువులు జాగ్రత్త

- వర్షాలు పడే వేళ పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి
- పశు పాకలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మండల పశువైద్యాధికారి జి.కె. ప్రభు

కొల్లిపర: వానాకాలంలో గ్రామాలల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు, బీడు భూములల్లో పచ్చని గడ్డి ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి సమయంలో పాముల బెడద కూడా ఎక్కువే. పశువులు బీడు భూములు, ఇంటి వద్ద ఖాళీ స్థలంలో పచ్చని మేతకు వెళ్లినప్పుడు, లేదా పశుపాక చుట్టూ ఖాళీ స్థలం ఉండి గడ్డి పెరిగి ఉంటుంది. ఇటువంటి సమయంలో వర్షాలు కారణంగా పచ్చని గడ్డిలో విషసర్పాలు ఉండి పశువులను కాటేసే ప్రమాదం ఉంది. పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి జి.కె. ప్రభు సూచించారు.

త్రాచు, కట్ల పాము కాటు వేస్తే....

త్రాచు, కట్ల పాములు పశువులను కాటు వేసినప్పుడు న్యూరోటాక్సిన్ వాటి శరీరంలోకి వెళ్లి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో శ్వాస వ్యవస్థ స్తంభిస్తుంది. నోటి నుంచి నురగ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. సరైన సమయంలో చికిత్స అందించకపోతే పశువు మృతి చెందుతుంది.

రక్త పింజిర కాటు వేస్తే..

పశువులను రక్తపింజర కాటు వేస్తే హీమోటాక్సిన్ విడుదలై రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో పశువు నోరు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. కాటు వేసిన చోట వాపు వచ్చి చర్మం రంగు మారుతుంది. మూత్రం ఎరుపు రంగులో వస్తుంది. సరైన సమయంలో చికిత్స అందకపోతే పది గంటల్లోపు మృత్యువాత పడుతాయి.



విషరహిత పాము కాటు లక్షణాలు

విషరహిత జాతి పాములు కాటు వేసినప్పుడు రెండు వరుస పళ్ళ ముద్రలు ఉంటాయి. కానీ వాటిలో పెద్దగా నిదానమైన రెండు ముద్రలు ఉండవు (విషపాము వద్ద వాటితో టాక్సిన్ ఇంజెక్ట్ చేస్తుంది) గాయాలు చిన్నగా ఉంటాయి. ఎక్కువగా పలుచని రేఖల వంటి ముద్రలుగా ఉంటాయి. కొద్దిగా రక్తం కారవచ్చు, కానీ ఇది ప్రమాదకరమైన స్థాయిలో ఉండదు.

విషపూరిత పాముకాటు లక్షణాలు

విషపూరిత జాతి పాములు కాటు వేసిన చోట ఉబ్బినట్టు, గాయంలా కనిపిస్తుంది. పశువు తిన కుండా, నీరసంగా ఉంటుంది. అదుపు తప్పటం (పిచ్చెక్కినట్టుగా) అటు ఇటు తిరగడం, నోటిలో నురుగు రావడం, వేగంగా గుండె చప్పుళ్ల, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది, పొట్ట ఉబ్బడం, కింద పడిపోయి కాళ్ల కొట్టుకోవడం చేస్తాయి. కొన్ని సందర్భాల్లో 3 నుంచి 5 గంటల్లోనే మృతి చెందుతాయి.

సూచనలు...

- పాము కాటుకు గురైన పశువును బయటకు పంపవద్దు,
- ఎక్కువగా నడిపించవద్దు, కదలకుండా ఉండాలి.
- కాటు వేసిన ప్రాంతానికి పైభాగంలో గట్టిగా కట్టుకట్టాలి. ఇది పాము విషం నరాల ద్వారా వ్యాపించకుండా ఉపయోగపడుతుంది.15 నిమిషాలకోసారి నిమిషం పాటు విరమించాలి. లేదంటే నరాలు నశించే ప్రమాదం ఉంది.
- కాటు వేసిన చోట కడుగవద్దు, కట్టు తీయవద్దు, ఇలా చేస్తే విష వ్యాప్తి పెరుగుతుంది.
- పశువును నీడలో బాగా గాలి తగిలేటట్లు ఉంచాలి. తల ఎత్తిన స్థితిలో ఉండేలా చూడాలి.
- వెంటనే పశువైద్యుడిని సంప్రదించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు.

సకాలంలో చికిత్స అందించాలి



పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు తరచూ గమనించాలి. పాము కాటు వేస్తే కరిచిన చోట గుడ్డతో గట్టిగా కట్టుకట్టాలి. బ్లేడుతో కోసి రక్తం పిండాలి. 20 నిమిషాలకోసారి కట్టును వదులు చేస్తూ ఉండాలి. స్నేక్ ఆంటీవీనమ్ ఇంజక్షన్, ఆట్రోపిన్ సల్ఫేట్, ఏవిల్ ఇంజక్షన్ పశువు రక్తంలోకి ఎక్కించాలి, నొప్పి నివారణకు స్టీరాయిడ్స్, అంటి బయాటిక్స్ , కార్టికోస్టియిడ్స్, అనాలెజిక్స్, గ్లూకోస్ వంటి మందులు అవసరాన్ని బట్టి ఇవ్వాలి.

– జి.కె. ప్రభు, పశువైద్యాధికారి, కొల్లిపర

పెనుమూడి–కొల్లూరు కరకట్ట రహదారి అభివృద్ధి చేయాలి

రేపల్లె: పెనుమూడి నుంచి కొల్లూరు వరకు కృష్ణా కరకట్ట రహదారిని అభివృద్ధి చేసి ప్రజా రవాణాకు అందుబాటులోకి తీసుకురావాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ అన్నారు. రహదారి అభివృద్ధి సమస్యపై ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రహదారి నిర్మాణంలో అడ్డంకులను తొలగించేందుకు పాలకులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. పెనుమూడి నుంచి తాడేపల్లి వారధి వరకు కృష్ణానది కరకట్ట రహదారి నిర్మాణం జరిగి 15 సంవత్సరాలు గడిచినప్పటికీ పెనుమూడి నుంచి కొల్లూరు వరకు పూర్తి స్థాయిలో రహదారి నిర్మాణం జరగలేదన్నారు. పెనుమూడి వారధి నుంచి రావి అనంతరం మధ్య కిలోమీటర్, పెదపులివర్రు నుంచి దోనేపూడి వరకు, కొల్లూరు లాకుల నుంచి కిలోమీటర్ దూరం వరకు రహదారి నిర్మాణంలో రైతుల నుంచి అడ్డంకులు ఏర్పడడంతో నేటి వరకూ సమస్యను పరిష్కరించి కరకట్ట రహదారిని ప్రజా రవాణాకు పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురావడంలో సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కేవలం కృష్ణా నది వరద ముంపుకు గురవుతున్న సమయంలో కరకట్టకు తాత్కాలికంగా మట్టిని మెరక చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారంపై ఆలోచన చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల గ్రామాలను వరద ముంపుకు గురికాకుండా అరికట్టడంలో కరకట్ట రహదారి కీలకమయినదని, తీర ప్రాంత ప్రజలు రాజధాని అమరావతికి తక్కువ సమయంలో చేరుకోవడానికి మార్గం సుమగమవుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు సత్వరమే నిర్మాణంలో ఉన్న అడ్డంకులను తొలగించి కరకట్ట రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, రేపల్లె మండలం కన్వీనర్ కర్రా బాబురావు, మండే యాకోబు పాల్గొన్నారు.



సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంజీ

అనూష మృతిపై విచారణ చేయాలి

నెహ్రూ నగర్: నగరానికి చెందిన రజక మహిళ తోరటి అనూష మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక వృత్తి దోబీ ఘాట్ల పరిరక్షణ సమితి అధ్యక్షులు చెన్నూరు చెన్నయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అనూష తల్లి సామ్రాజ్యంతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం చేశారు.

సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్ చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. బేతపూడి శివారులోని ఉయ్యూరువారిపాలెం పంట కాల్వలో పూడిక తీయించాలని ఆ ప్రాంత రైతులు అర్జీ చేసుకున్నారన్నారు. చికెన్ షాపు వ్యర్థాలతో అనారోగ్య సమస్యలు పొంచి ఉన్నాయని తన ఇంటి పక్కనే ఉన్న చికెన్ దుకాణాన్ని తొలగించాలని రేపల్లె నుంచి చెరుకూరి సాంబోస్ ఫిర్యాదు చేశాడన్నారు. రేషన్ కార్డుకై చోడాయపాలెం నుంచి నలిగల సాల్మన్‌రాజు దరఖాస్తు చేసుకున్నాడని చెప్పారు. ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరుతూ భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన నన్నేపాముల నాగేశ్వరరావు, వెల్లటూరు గ్రామంలో చేతి పంపు మరమ్మతుల సమస్యపై ఆ గ్రామ నివాసి సైకం వెంకట సుబ్బారావు, జంపని గ్రామంలో తనకు చెందిన 50 సెంట్ల భూమిని సర్వే చేయించి హద్దులు చూపాలని అమృతలూరు మండలం ఎడమూరు గ్రామానికి చెందిన ఉప్పాల వీరులు అర్జీలు ఇచ్చారన్నారు. సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునని చెప్పారు.

రహదారి ప్రమాదకరంగా మారింది సార్..

- మునిసిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు
- సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీపీఎం నాయకుల అర్జీ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెనాలి: ప్రమాదకరంగా మారిన రహదారి నిర్మాణంపై మున్సిపల్ అధికారులు ఏడాదికాలంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం నాయకులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. తమకున్న జ్యూడీషియల్ అధికారం ద్వారా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశా రు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఎం నాయకులు కె.బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి అర్జీని సమర్పించారు. స్థానిక చెంచుపేట 28వ వార్డులో కైలాస్‌భవన్ రోడ్డులో డోర్‌నెంబర్ 13– 13–13 వరకు సుమారు 500 అడుగల నిడివి సిమెంటురోడ్డు నిర్మాణానికి తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇదే అంశంపై గత ఏడాది జూలై 15న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీని ఇచ్చామనీ, జులై 29న మున్సిపల్ కమిషనర్‌కూ అర్జీని ఇచ్చినట్టు గుర్తుశారు. సంవత్సరం గడచినా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు మున్సిపల్ చట్టం ప్రకారం కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పన్ను చెల్లింపుదార్లకు ఉన్న హక్కులను అధికారులు విస్మ రించారని విమర్శించారు. కొద్దిరోజులుగా కుండపోత వర్షాలతో బాట ప్రమాదకరంగా మారిందన్నారు. అదే రోడ్డులో 150 కుటుంబాలకు రోడ్డులో రాకపోకలు సమస్యాత్మకంగా మారిందని షేక్ హుస్సేన్‌వలి చెప్పారు. అధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు వేయాలని కోరారు. సంబంధిత ఫొటోలతో సహా అర్జీని సమర్పించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 11 అర్జీలు వచ్చాయి. కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు అర్జీలను స్వీకరించారు. రెవెన్యూశాఖ పరిధిలోనివి అయిదు అర్జీలు రాగా, మున్సిపాలిటీ పరిధిలో రెండు, పంచాయతీరాజ్ శాఖలో ఒకటి, పోలీసు విభాగానికి సంబంధించి ఒకటి, విద్యాశాఖ పరిధిలో మరొక అర్జీ వచ్చాయని ఏవో తెలిపారు. సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆమె పరిశీలించారు. మురుగు కాల్వలపై మెట్లు నిర్మించడాన్ని గమనించిన ఆమె వాటిని పగలగొట్టించారు. కాల్వల్లోని షీల్ట్‌ను తొలగించేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ రాధిక

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

తెనాలిఅర్బన్: దోమల పుట్టకను నియంత్రించేందుకు గంబూసియా చేపలు దోహదపడతాయని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాల్వల్లో గంబూసియా చేపలను సోమవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూసియా చేపలను కాల్వల్లో వేయడం వలన లార్వా దశలోనే దోమలను తింటాయని, తద్వారా వాటి ఉత్పత్తి తగ్గిపోతుందని చెప్పారు. గంబూసియా చేపలు ఒక రోజుకు 180 నుంచి 300 లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. చేపలు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలు బ్రతికి ఉంటాయని, 42 డిగ్రీ ఉష్ణోగ్రతకు తట్టుకుంటాయని వివరించారు. ఆక్సిజన్ తక్కువగా ఉన్న నీటిలో కూడా ఇవి బాగా పెరుగుతాయని పేర్కొన్నారు. తెనాలి పట్టణ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలోఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



చేపలను కాల్వల్లో వేస్తున్న ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు

మీ అంతు చూస్తా....

మేనేజర్ చాంబర్‌లో మహిళా ఉద్యోగిని దురుసు ప్రవర్తన

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని పలువురు ఉద్యోగులపై దోషణలకు దిగ్గింది. అంతటితో ఆగకుండా మీ అంతు చూస్తానంటూ బెదిరించింది. వివరాల్లోకి వెళితే మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్ చాంబర్‌లో పనిచేసే ఓ మహిళా ఉద్యోగిని సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అవకతవలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైంది. దీంతో ఆమె సోమవారం తన కార్యాలయానికి వచ్చి ఒక మహిళా ఉద్యోగినిపై దూషణలకు దిగింది. దీనిని మేనేజర్ వారించినా ఆయనను కూడా బెదిరించింది. అంతటితో ఆగకుండా తన స్థానంలో వేరే మహిళ ఉద్యోగి రానున్నదనే ప్రచారం నేపథ్యంలో ఆమెకు ఫోన్‌చేసి బెదిరించింది. దీంతో అవాక్కు అయిన మేనేజర్, ఇతర మహిళా ఉద్యోగినిలు ఆమెపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. తన స్థానాన్ని మార్చిన వారందరి అంతుచూస్తానంటూ దూషణలకు దిగినట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని ఉద్యోగి తెలిపారు. మొత్తం మీద ఆమె వ్యవహారం వివాదస్పదంగా మార్చడం మున్సిపల్ కార్యాలయంలో చర్చానీయాశంగా మారింది.



బాగు చేయండి.. సారూ...

చెంచుపేటలోని మాజీ ఎమ్మెల్యే నివాసం చివర ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలు పడి ఉండటం వలన చిన్నపాటి వర్షానికి కూడా దానిలో నీరుచేరి రాకపోకలకు అవరోధంగా మారుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

–తెనాలిఅర్బన్